# బంజారా భాష స్వరూపం వైశిష్ట్యం

**డా. హెచ్. కిషన్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, బద్రుక కళాశాల, కాచిగూడ, హైదరాబాద్.**

1. **భాష** : "భాష్యతే ఇతి భాష''. భాషింపబడేది అని అర్థం. ''భాషావ్యక్తాయాంవాచి" వచించుటకు ఉపయోగపడేది భాష అని మరో నిర్వచనం. తమవైన ఆలోచనలను, ఊహాపోహలను ఎదుటివారితో పంచుకోవడం కోసం, మానవ సమూహం ఏర్పాటు చేసుకున్న ధ్వనుల సంకేతార్థ వివరణ, భాష,

ఇలా ఆలోచన చేస్తే భాషకు లిపి అవసరం లేదు. మాట్లాడడం, వినడం అనే రెండింటినీ ఒక గాటన చూడాలి. అలాగే చదవడానికి, రాయడానికీ కలిపి ఒకే భావనతో ప్రతిస్పందించాలి. అలాంటప్పుడు భాషకు లిపి అవసరం లేదు. కనీసం వినడానికి, అనడానికి శక్తి ఉంటే చాలు. సమర్థవంతమైన భావజాలంతో, దృఢతరమైన శక్తిగా, స్వేచ్ఛాయుత స్పందనలతో మానవజాతి మనుగడకు ఆధారమైన భాష మొదట లిపి లేని భాష, ఆ సంప్రదాయానికి కట్టుబడిన అత్యంత ప్రాచీనమైన, పురాతనమైన భాష లంబాడీభాష లేదా బంజారాల భాష.

2. **బంజారా భాష నిర్మాతలు** : బంజారాలు అంటే వ్యాపారం చేసేవారు. ఆ వ్యాపారం కూడా ఆ రోజుల్లో అన్ని చోటలా సులభంగా లభించని ఉప్పు, అలాగే పశువుల క్రయవిక్రయాలూ చేసేవారు. వారి భాష, వారికే స్వంతమైన భాష బంజారాల భాష. అలాంటి లిపిలేని భాష పురాతనమైన భాష అయిన బంజారా భాషకు ద్రష్టలు, వ్యవహర్తలు, స్రష్టలు బంజారాలు. దేశమంతా వ్యాపించిన వీరు వివిధ ప్రాంతాల మాండలికాలను అనుసరించి ఏది వ్యవహరిస్తున్నా కూడా, మూలరూపం అయిన భాష మట్టుకు ఎలాంటి మార్పు చేర్పులను లోనుకాని మూలభాష, తల్లి భాష, అమ్మభాష–బంజారాభాష.

3. **భాషా నిర్మాణం** : మానసికమైన భావ పరంపరలను వ్యక్తులు పరస్పరం తెలియజేసుకోవడానికి ఉపయోగించే వాగ్రూపమైన సాధనమే భాష. తన జాతి ఆచార వ్యవహారాలను తనవారి తీరు తెన్నులను, కట్టు, బొట్టు మున్నగు సంస్కృతి సంప్రదాయాల వంటి అనేక రకాల విశేషాలను బాల్యం నుంచి తెలుసుకోవడానికి అనువైనది ఇది. ఈ సంప్రదాయాల్లోంచే భాష నిర్మింపబడుతుంది..

బాహ్య ప్రపంచాన్ని తెలుసుకోవడానికి తొలి ఆధారం భాష. బాధ కలిగితే ఏ వ్యక్తి అయినా తన భాషలోనే, అనగా లంబాడి భాషలో 'యాడి' అని, అదే తెలుగు భాషలో 'అమ్మా' అని అనడం సహజమే. సంభాషణ, విషయ, విశ్లేషణ చేయడం కూడ ఇబ్బందిగా ఉండదు. పరస్పరం చర్చించుకోవడానికి వీలు ఉంటుంది.

4. **అవసరం :** మానవ చరిత్రలో ఏ జాతి వికాసం పొందినా లేక పొందాలన్నా ఆ జాతి ప్రజల నాల్కలపై నడయాడబడే భాష ఎనలేనిది. పరస్పరం తమ అభిప్రాయాలను వ్యక్తీకరించుకోవడానికి మేధస్సులో జనించే సృజనాత్మకతకు ప్రధాన వాహకం భాష. మనిషి పరిపూర్ణ వికాసానికి, సమగ్ర అభివృద్ధికి సరియైన పరిజ్ఞానం పునాది వంటిది భాష.

లంబాడీ పిల్లలు పరిపూర్ణ వ్యక్తులుగా తయారు కావాలంటే సాహిత్యం పాత్ర చాల గొప్పది. నాటి నుండి నేటి వరకు మన సంస్కృతిని, అందులో మంచి చెడ్డలను అందించగలిగేది అయిన లంబాడీ భాషకు బంజారాల సాహితీ కథలే ఆధారం. నిజానికి చిన్నతనం నుండి తమ పూర్వీకులు అందించిన విజయాలు, వాళ్ళు పాటించిన సంస్కృతి, సంప్రదాయాలు, అలవాట్లు, పద్ధతులు మొదలగునవి. నీతి కథలు వాటి నుండి వెలువడే మంచి గుణాలు వీరి రక్తంలో ఇంకాలి. అప్పుడు మాత్రమే తన జాతిని కాపాడుకోగలుగుతారు. మనకు సొంత ఆలోచన, సొంత వ్యక్తిత్వం రూపుదిద్దుకోవడం కేవలం భాష ద్వారానే సాధ్యమౌతుంది.

సమకాలీన సమాజంలో మార్పులు, ఆశలు మానవ విలువలు తమ సాహిత్యం ద్వారానే తెలుస్తాయి. భాషా సాహిత్యాలు వీరికందరికి అవసరమైనవి, సృజనాత్మకత, నైపుణ్యాలు, భావస్పష్టత, భావ ప్రకటనా సామర్ధ్యం రావడానికి అనువైనది భాషద్వారానే.

5. **ప్రాధాన్యత :** ఎంతటి మేధావి అయినా ఆలోచించేది తన భాషలోనే. బంజారాలు, ఆధునిక కళధర్మాన్ని అనుసరించి తెలుగు నేర్చుకున్నప్పటికీ, లంబాడి భాషలోనే ఆలోచించి తెలుగులో అనువదిస్తారనేదే అక్షర సత్యం. ఇక్కడ కొన్ని ఉదాహరణలు పరిశీలిద్దాం.

1. **పొడుపు కథ** : **బంజారా భాషలో** : "అవుడికి బుట్టిమా చావళ్ చావళ్ (తార)

**తెలుగులో** : ''చిన్న గంపలోని బియ్యమే బియ్యం" (చుక్కలు)

2. **సామెత** : **బంజారా భాషలో** : "ఏ కానేతి సామళన్, ఓ కానేతి కాడాకే వాళ్.

**తెలుగులో** : ''ఈ చెవితో విని, ఆ చెవి నుండి తీసేస్తావు"

| | **బంజారా భాషలో** | **తెలుగులో భాషలో** |
|---|---|---|
| 3. **సాధారణ నామాలు** : | మాటి | మనిషి |
| | కూండి | అమ్మాయి |
| | ఘర్ | ఇల్లు |
| | దూద్ | పాలు |
| 4. **ద్వంద్వ పదాలు** : | బాబేటా | తల్లికొడుకు |
| | బెట్ బేటా | కూతురుకొడుకు |
| | డోక్రా డోక్రి | ముసలిది ముసలోడు |

| | | |
|---|---|---|
| | గోర్ గొణ్ణి | భార్య భర్తలు |
| | ఛోరా ఛోరి | అబ్బాయి, అమ్మాయి |
| 5. **జంట పదాలు :** | దాణామాణా | గింజా గిత్రా |
| | గోర్లి గావ్ డి | గొర్రెలు, ఆవులు |
| 6. **మూల సంఖ్యలు** (1–10) : | ఏక్, ది, తీన్, చార్, పాంచ్ | 1, 2, 3, 4, 5 |
| | ఛో, సాత్, ఆట్, నవ్, దస్ | 6, 7, 8, 9, 10 |
| 7. **అంకెలు దశాంశాలు** (10–100) : | | |
| | దస్, వీస్, తీస్, చాళీస్, పచ్చాస్ | 10, 20, 30, 40, 50 |
| | సాట్, సత్తర్, అస్సీ, నవ్వద్, ఏక్ సో | 60, 70 ,80, 90, 100 |
| 8. **పెద్ద సంఖ్యలు :** | సో, హజర్, దస్ హజర్, | 100, 1000, 10, 000 |
| | లాక్, దస్ లాక్ | 1,00,000, 10,00,000, |
| 9. **భిన్నాంశాలు** : | పావ్ లా, ఆదో, డ్వాడ్, అడాయి | 1/4, 1/2, 1–1/2, 2–1/2 |

6. **ఉప సంహారం :** ఈ నాటి సమాజ అవసరాలలో అనువాదం మొదటి స్థానంలో ఉంది. బంజారా భాషకు పూర్వరోపవైభవం రావాలంటే, ఆనాటి విశిష్టతను మనం నిలబెట్టాలంటే, అనువాదం ఒక అద్భుతమైన ఆయుధం. బంజారా భాష నుండి తెలుగులో అనువాదమనే ప్రక్రియ మెదడులో జరుగుతుంది. కాబట్టి బంజారా భాషలో స్పష్టమైన అవగాహన, వ్యక్తీకరణ నైపుణ్యాలుంటేనే ఇతర భాషలో అనువాదం చేయడం సాధ్యమౌతుంది.

ఆలోచన నేర్పగలిగేది మన భాషలోనే అంటే తల్లిదండ్రుల నుండి వచ్చే భాషలోనే అందువల్ల ఎలాంటి ఒత్తిడి లేకుండా శ్రమరహితంగా సమాజానికి మంచి వార్తలు విషయాలు అందిస్తాం. అందుకే మన భాషకు మించిన భాషలేదని చెప్పవచ్చు.

"స్వభాష" వ్యాసంలో జంఘాలశాస్త్రి నోట పానుగంటివారు మాతృభాష మాట్లాడలేని వారిని వ్యంగ్యంగా పరిహసించారు. మ్యావ్ అనలేని పిల్లి ఉంటుందా ? కిచకిచ అనలేని కోతి ఉంటుందా ? ఉండవు. కానీ, ఈ నాటి సమాజంలో మాతృభాషలో మాట్లాడలేని వారు ఉంటున్నారు. ద్వితీయ భాషగా ఇతర భాషలు ఎన్ని నేర్చినా, బహుళ ప్రయోజనం మట్టుకు మాతృభాష వల్లనే అనాలి.

ఒక పిల్లి తన పిల్లలను వెంట పెట్టుకొని వీధి వెంటపోతుంది. అంతలో ఎదురుగా ఒక కుక్క వచ్చింది. దాంతో పిల్లి పిల్లలు గుండెలు అవిసిపోయాయి. భయంతో బిక్కచచ్చిపోయాయి. తల్లిపిల్లి, తన పిల్లలతో తన మాతృభాషలో, భయం లేదు అని ధైర్యం చెప్పింది. ఆ తర్వాత కుక్క భాషలో 'భౌభౌ' అంటూ అరవడంతో, భయంతోపాటు ఆశ్చర్యం ముపిరిగొనగా, కుక్క తోక ముడుచుకొని పారిపోయింది. తల్లి పిల్లికి వచ్చిన ద్వితీయ భాష - వారికి వచ్చిన ఆపద నుండి గట్టెక్కించింది. కాని పిల్లి పిల్లలకు ధైర్యం నూరిపోసింది మట్టుకు మొదట వాటి మాతృభాష. బంజారాల

విషయంలో కూడా ఈ విషయంలో కూడా ఈ విషయం సత్యం దూరం కాదు. బంజారాలు ఎంత చదివినా, పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసినా, తమ భాషను మాత్రం మరచిపోకూడదు. ప్రతి బంజారా కుటుంబంలో పిల్లలకు లంబాడి భాషను నేర్పించాలి. లేనట్లయితే ఇప్పటికే లంబాడి స్త్రీలు, పురుషులు ధరించే వేషాధారణ వేగంగా కనుమరుగైపోతున్న విషయం అందరికి తెలిసిందే. కాబట్టి రాబోయే తరానికి రిజర్వేషన్లు ఉండాలంటే, ప్రతి లంబాడి పౌరుడు తన భాషను నేర్చుకొని తీరాల్సిందే. నేర్పించే బాధ్యత కూడ తల్లిదండ్రులపైన ఉందనే విషయాన్ని మరచిపోరాదు.

## 7. ప్రభుత్వ సహకారం :

తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ప్రతి జిల్లాలో బంజారాలు నివసిస్తున్నారు. వీరందరు ఒకే భాషను మాట్లాడతారు. అదే లంబాడిభాష లిపిలేనిది. ఈ భాషకు ప్రత్యేకమైన గుర్తింపు రావాలంటే ప్రభుత్వం చొరవ తీసుకొని లంబాడీ భాషాదినోత్సవం ప్రకటించాలి. దీనికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

**ఆధార గ్రంథాలు** :


1. బంజారా చరిత్ర సంస్కృతి – ప్రగతి : చి. చీనియానాయక్
2. తెలుగు లంబాడీల గేయ సాహిత్యం : డా. జనపాల శంకరయ్య
3. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం–జీవన చిత్రణ : డా. సూర్యాధనంజయ్
4. సుగాలి సంస్కృతి–భాషా సాహిత్యాలు : డా. ఎం. గోనానాయక్